


రవణ తన ఎడపిల్లని వేసుకుని వస్తుంది. కూర్చుని ఏవేవో కబుర్లు చెపుతుంది. ఆమె వింటుంది—విన్నట్లుంటుంది. నవ్వుదా మనుకొని పరాకులో పడిపోతుంది.

ఎదురుగా కూర్చున్న జానకీ, రవణలలో కలసివుంగే, మిధ్యలోకి తొంగిచూస్తుంది. ఏకాంతత్వం అనుభవిస్తుంది.

ఇదివరకటి పిల్లలమీద ప్రేమ ఇప్పుడు లేదు. అసహ్యమూలేదు, మమకారంలేదు. ఆత్మృతలేదు.

ఎప్పుడేనా సీత వస్తుంది. జడవేయ మంటుంది. శాంత జడవేస్తుంది. పువ్వులు పెట్టుకుంటావా అని అడుగదు. ఆపిల్లకి తెలుసు ఈమెలోని మార్పు........

* * *

## 9

క్రాని, ఎన్నాళ్లు—అలాగ అర్థంకాని విధంగా —వెళ్ళకలగడం? 'ఎక్కడికి వెడుతున్నా వమ్మా' అంటే—'ఏమో' అన్నట్లు?,

అయినా—ఎన్నాళ్ళో!

మళ్ళీ యధాప్రకారం ఆకలిమీ లేమీ వచ్చి వున్నాయి. చూట్టానికి వచ్చిన సూర్యాన్ని షికారుకి పోతున్న నారాయణ పలకరించేడు; 'ఓహో' అని. సూర్యం ఇల్లంతా కలయ తిరిగేడు. మేడఎక్కి వరండాలో కూర్చుని వున్నాడు. శాంతమ్మ సందెమసకలవేళ మిద్దెమీదికి వచ్చింది. అతన్ని చూసింది. అలాగనే పిట్టగోడకి చేర్లబడి కూర్చుంది.

చీకటిపడింది. రవణగారింట్లో నూతిగిలక చప్పుడు వినపడింది. దీపం కాళ్ళూచేతులూ కలిగివున్నట్లు ఇటూ అటూ తిరుగుతోంది.

సూర్యం మాట్లాడడు. శాంతమ్మ అసలు ఏదో ధ్యాసలోవుంది.

ఎంతలో ఎంతమార్పువచ్చింది. ఆరోజు —ఆరాత్రి—ఆభావన....అన్నీ సూర్యం స్మృతికివచ్చేయి. అతని శరీరం జలదరించింది. అతను అప్రయత్నంగా వణక సాగేడు. తననితను తిట్టుకున్నాడు. శాంతమ్మ కేసి భయంతో చూశాడు. ఆమె శిలాప్రతిమ లాగవుంది. కదలిక — జీవం—ఏమీలేక చూస్తూన్న కొద్దీ అతనికి భయం ఎక్కువ కాసాగింది....అతను లేచి నిలుచున్నాడు.

వెడుతున్నాననేనా చెప్పకుండా మెట్లుదిగి వెళ్ళిపోయాడు.

* * *

నారాయణమూర్తి మళ్ళీ ఇనప్పెట్టిదగ్గర కూర్చునివున్నాడు. డబ్బునిగురించి ఏతగువూ అతనిమధ్యని పడడంలేదు. అతని షికారు పూర్తయినతర్వాతటి శుభకార్యం ఇక ఏఆటంకంలేకుండా జరుగుతోంది....

బయటికి వెడుతున్న సూర్యం ఆగి పల్కరించేడు.

"మామయ్యగారూ! నేను వెడుతున్నానండి."

ఆయన అదరిపడ్డాడు.

"ఓహో! సరే—మళ్ళీ ఎప్పుడు? రేపు ప్రొద్దున్న కనపడతావుకదూ?"

"అబ్బే—తెల్లారగట్ల వెళ్ళిపోతున్నానండి—"

"వెళ్ళిపోడం???" నిద్రనించి మేల్కొన్నాడు. "వెళ్ళిపోతున్నావ్? తెల్లారగట్ల?? ఎక్కడికి??? ఎందుకు...."

"ఉద్యోగం ప్రయత్నించుకోవాలండి."

"ఆహా—శుభం....వెళ్ళు నాయనా, ఎలాగో నెగ్గుకురా—"

"అత్తయ్యగారితో చెప్పండి."

"నువ్వు చెప్పకూడదూ?—"

"ఎక్కడో వున్నారు—పోనీ మీరు చెప్పండి....వెడుతున్నా—"

నారాయణ మళ్ళీ తలవంచుకున్నాడు. 'కుర్రవాడు—పనికివచ్చేవాడు! అతన్నిచూస్తే నాకు జాలివేస్తుంది' అనుకున్నాడు.

నిజమే—ముగ్గురు పిల్లల తండ్రిఅయి అతను ప్రపంచంలో ప్రవేశించేడు. ఇంక ఎలా నెగ్గుకురాగలడో మరి.

'సహాయంచేస్తే మంచిదే—నేతప్పకుండా సహాయంచేస్తాను....' అని తీర్మానించుకున్నాడు. "ఏంచెయ్యను?—ఈరాత్రే వెళ్లి మంచిసలహా ఇస్తాను...."

ఇలాగ అనుకుంటున్నాడు. ఇంతలోనూ శాంతమ్మ చీమలాగ ప్రవేశించింది.

ఏదో చెపుదామనుకుని అతను సగం తల యెత్తేడు. ఆమె ఏదో చెప్పబోతోంది. తను ఆగిపోయాడు.

"ఇదిగో—ఒక్కక్షణం ఇంక ఈఇంట్లో వుండలేను...."

"............"

"............"

'ఏం అన్నట్లు బెదురుతూ ఆమెవైపు చూశాడు—ఆఖరికి.

"ఎందుకో చెప్పలేను. "ఆమె నిశ్చలంగా మాట్లాడుతోంది. ఆమె కిటికీలోంచి

దూరానికి చూస్తోంది. ఆ గోడనిదాటి చీకట్లో ప్రయాణంచేసి. ఆమెచూపులు నల్లటిముద్ద లాగవున్న ఒకచెట్టుమీద వాలివున్నాయి.

—"ఈ యింట్లో వుండలేకపోతున్నాను. ...ఈ పూ రేవద్దు....ఇంక ఒక్క క్షణం వుండను."

"బాగానేవుంది—" అన్నాడు. తలెత్తి చూశాడు. ఆమెలేదు. వెళ్ళిపోయింది.

అలాగ అతనన్నాడేగాని — అతనికి అనుక్షణమూ ఎవరో గుండెలో చెయ్యి వేసి కెలికినట్లవుతోంది. ఏమిటో అను కుంటూవచ్చేడు ఇన్నినాళ్లూ. ఇప్పుడు అతనికి అర్థమయ్యింది. తనకీ అక్కడ వుండాలని లేదని........

"ఎక్కడికేనా పోదాం—ఈవేళే—"

"ఇల్లూ—అదీ???"

"ఉంటుంది. ఏమవుతుంది? సుబ్బమ్మ త్తయ్యకూడా వొస్తుంది—పదండి ఎక్కడి కేనాపోదాం—"

'సరే....ఎక్కడికని—' అందామను కున్నాడు. కాని ఏమీ అనలేకపోయాడు.

* * *

మర్నాడు చేయవలసిన సన్నాహమంతా చేసేసి ముగ్గురూ ప్రయాణానికి సిద్ధపడ్డారు. యాత్రలకి!

నారాయణ—ఎలాగ మనస్సుని సమా ధానపరచుకున్నాడో కాని—ఇల్లంతా ఒక ముసలిబంట్రోతు చేతిలోపెట్టి అతికష్టంమీద తను తప్పుకున్నాడు.

అన్నితలుపులూ తాళాలు వేశాడు. ఇంట్లో సామానంతా లిస్టురాశాడు. శీళ్ళువేసే వాటికి వేశాడు. ఈలెక్కంతా బంట్రోతుకు వప్ప గించేడు.

ఇవన్నీ చూసేసరికి ఆమెకి విసుగు కలిగింది.

"మనం బతికి తిరిగివస్తే చూద్దాంలెండి" అంది.

"రావనా?" అందామనుకున్నాడు. "వస్తే మాటే" అన్నాడు.

* * *

## 10

ఆ విధంగా ప్రయాణమై దేశాలు తిరిగేరు. దక్షిణయాత్రలన్నీ అయ్యాక ఉత్తరయాత్ర లన్నారు. కాశీ, ప్రయాగ, హరిద్వారం, బదరీ మొదలైన స్థలాలన్నీ తిరిగేరు....

ఎందుకు?........

అనుకోని సుఖం కలిగింది. కలిగింది కలిగినట్లుందీ? వెంటనే దుఃఖంగా విరుచుకు పడింది. రెండూ అనుకోనివే—రెండూ వారిని తీవ్రంగా అల్లాడించినవే—రెండోదానితో వారి జీవితశకటం విరుచుకుపడింది.—

వారి జీవితపథాలని మార్చింది. వారినే మార్చింది. ఆ ప్రదేశం వదలేరు.—ఇంకో అనుభూతంలో—ఇంకో విధంగా ఏమన్నా ఈ దుఃఖం మరచిపోగలమేమో అనుకుని—

తిరిగి తిరిగి గంగాపుష్కరం వచ్చేసరికి కాశీ చేరుకున్నారు. కాశీకి వచ్చినవారు ఆంధ్రదేశంనుంచి వేనకువేలున్నారు, అనేక ప్రత్యేక రైళ్ళలో, గుంపులు గుంపులుగా యాత్రికులున్నారు. ఆ మహాతీర్థంలో వీరు ఒకగుంపుతో కలసిపోయారు.

కొన్నిరోజులు ప్రయాగలో గడపడానికి చాలామంది వెళ్ళేరు. గంగాపుష్కరం కాశీ ప్రయాగలలో చాలా బ్రహ్మాండంగా జరుగు తుంది. కాని, యాత్రికుల నెవ్వరినీ అక్కడ రెండు రోజులకంటే ఎక్కువ వుండనీయడం లేదు.

* * *

సాయంత్రమయ్యేసరికి ప్రయాగ వచ్చి చేరేరు. అక్కడ ఒకసత్రవులో బసచేశారు. వీరిగుంపులో పది పదిహేనుగురు యాత్రి కులుంటారు. అంతా ఒకే కుటుంబంగా కలసి ప్రయాణం చేసి వస్తున్నవారేమో. స్త్రీలంతా కలిసి లోపల హాలులోనే పండుకున్నారు.

నారాయణ మిగిలిన మగవారందరితోనూ వసారాలో ఆరాత్రి గడప నిశ్చయించు కున్నాడు.

* * *

## 11

ఎవరో గొల్లుమన్నట్లయింది. ఆమెకి తెలి వచ్చినట్లుకూడా అయింది. కాని బడలికచేత అలసివున్న ఆమె భౌతికశరీరం విశ్రాంతి కోరింది. ఎంతకీ కళ్ళుతెరవబడలేదు. ఇది వరకే మొద్దుబారివున్న మనస్సు మాట్లాడ లేదు.

మళ్లీ కాస్త సేపటికి ఆమెని ఎవరో కొట్టి లేపినట్లయింది. ఆమె వక్కసారి ఇటూ అటూ కదిలింది. ఇంతట్లోనూ ఒక పెద్దవెల్లువ ఆమె అగాధహృదయ కుహరం లోంచి బయలుదేరి పాతాళఝరీవేగంతో పైకి ముంచుకువచ్చింది. ఆమెకళ్ళు నీటిలో తేలిపోసాగేయి. ఆమె నవనాడులూ తొందర పెట్టసాగేయి—

ఆమెకు తెలియకుండానే ఆమెచేతులు వేటికోసమో వెతుక్కుంటూ పోసాగేయి. మళ్లీ కళ్ళుతెరిచింది....కాస్త ముందుకు జరిగింది. రెండుచేతులతోటీ—ఆ వస్తోన్న— ఆ దిగివచ్చిన—పిల్ల నిగుచ్చి తనగుండెల్లోకి తీసుకుంది. బలవంతాన్ని కళ్ళుమూసుకుంది.

'అమ్మా' అని ఏడుస్తున్న ఆపిల్ల—అమ్మ గుండెల్లో కలసిపోయినట్లుగానే, తక్కున వూరుకుని నిద్రపోసాగింది.

ఆమె కొంచెం కదిలింది; తలెత్తి చూసింది....

అబ్బే—మూడేళ్ళు—లేదూ—రెండేళ్లు వెళ్ళినపిల్ల—ముద్దులుగొలికే ముత్యంపు చంటిబిడ్డ—అర్ధరాత్రవుతుంది.

ఎలాగొచ్చిందో? ఎక్కడినుంచి వూడిపడిందో?—కాని, ఆమెదగ్గరికి—ఆమె వక్షస్థలంలోకి వచ్చిపడింది! వెంటనే హత్తుకుపోయింది. డొక్కలో చొచ్చుకుపోయింది.

గొల్లున ఏడ్చింది—ఒక్కటే యేడ్పు "అమ్మా" అని. ఆ యేడ్పే ఈతల్లిగుండె పీకిలేపింధి.

తనవడిలో—తన కడుపుకు అంటుకుపోయి భోరున ఏడుస్తున్న పసికందుని ఇంకోసారిచూసింది. తనకదలికమూలాని, నిద్రపోబోతున్నపిల్ల యేడుపు కాస్త కదిలింది. వెంటనే ఆమె పిల్లని మరింతదగ్గరికి తీసుకుంది—ఆమెస్థన్యం ప్రవహించింది.....

అనుభూతికాని మాంద్యావస్థలో ఆనందసౌరభాన్నిపొందింది. ఏదో లోటుపడిన—పోయినవస్తువును తిరిగి సంపాదించుకున్నట్టు; తనకోసం ఎవరో ప్రత్యేకించి పంపినట్లు; చీకటిలో చిక్కుకునివున్న తనను వెలుగులోని కీడ్వడానికి ఒకదీపాన్ని పంపినట్లు—ఆమెకయింది.

పిల్లని పలకరించింది. గుచ్చి కౌగలించుకుంది. పిల్ల వళ్ళుతెలియకుండా నిద్రపోయింది!....

*　　*　　*

ఎవరు?

ఈ చంటిపిల్ల!

తనెవరు? తనకీ ఈపిల్లకీ ఏనాటిదీ సంబంధం? ఎవరు పంపించేరు? ఏమి చెయ్యమని?

*　　*　　*

"అమ్మడూ!—బజ్జోతల్లీ!

"ఎన్నాళ్ళకొచ్చేవ్....అబ్బ....ఎంతకాలమయిందమ్మా....నిన్ను మళ్లీ కలుసుకుంటాననుకోలేదు—

"నన్ను ఎలాగ వదలిపెట్టేసేవమ్మా....నీకోసం ఎంతఏడ్చేను....ఎన్నివూళ్లుతిరిగేను. ఆఖరికి ఇక్కడ దొరికేవా నాతల్లీ??

"రా తల్లీ! నిన్నువదలను....నేను నిన్ను అలంకరించను. నువ్వు నాకు అలంకారానివి. నాశక్తివి, నాఆత్మవి...ఎక్కడపడితే అక్కడ నిన్ను చూసుకుంటాను. నువ్వు నా దీపానివి-నా ప్రాణనిధానానివి.

"రాతల్లీ....నాలో నువ్వయిపో. నన్ను పలకరించి నన్ను శమింపచేయి, నన్ను నడిపించు....

"నీకోసం కలలుగన్నాను—నీకోసం ప్రయాణంచేసేను—నీకోసం పలకరించేను. నిన్నుగన్నాను—"

కలవరించింది. కలవరింతల్లోనే కనీ వినని నిద్రలో పడిపోయింది. ఒక ఆనంద మరీచిక అయి తేలిపోయింది.

*　　*　　*

## 2

తెల్లవారుఝాము వేళ—

ప్రతిదినం, ఈ ప్రయాణంలో, సుఖనిద్రకి ఆమెకాదు సరికదా ఎవరూ నోచుకోలేదు. ఏమిటోగాని, ఒక అగాధంలాటి నిద్రలో ఆమె పడిపోయింది....ఈ జీవమే పోయినట్లుగా—

అరగంటనుంచి నారాయణ ఆమెని లేపుతున్నాడు—అరగంటనుంచి గొంతుక చించుకుంటున్నాడు.

—ఆఖరికిలేచింది. "ఊ—" అని మూల్గుతూ. కనువిప్పింది.

"లే—లెమ్మంటే—"

"ఊ—తొందరేంవచ్చిందీ? అర్ధరాత్రి ఇంకా కాలేదూ—" అని, పిల్లని ఇంకా దగ్గరగా తీసుకుని కళ్ళుమూసుకుంది.

"ప్రయాణమవుతోంటేను:—" అతన్ని పూర్తిగా విసుగు ఆవరించి, "బండీ మించిపోతుందే—"

ఆమెకు పూర్తిగా మెలకువవచ్చింది. "ప్రయాణం—?!" కొంచెం తలయెత్తి చూసింది.

ఆ హాలులో తనతో సమంగా పడుకున్న అనేకమంది—స్త్రీలు—పిల్లలు—ఎవరూ ఒక్కరుకూడా—లేరు!

"అంతా వెళ్ళిపోయారు....మిగిలుంట—మనమే! అన్నాడు.

"వెళ్ళాలా?—తప్పదా??" అంది. పిల్లకేసిచూసింది. వొళ్లుతెలియని నిద్రలోవుంది పిల్ల. "నేరాను....ప్రయాణం తెల్లారిం తర్వాత—" అంది.

అతను రుసరుసమన్నాడు. లేచినుంచున్నాడు. ఇంతవరకూ పిల్లనిచూడలేదు.

"నేరాను ఇప్పుడు వెళ్ళడానికి వీల్లేదు,"—అని కచ్చితంగా చెప్పింది, పిల్లని ఇంకాస్త దగ్గిరగా తీసుకుని కళ్ళుమూసుకుంది.

"ఏవే నీమతి పోయిందా ఏమిటే? ఎవరాపిల్ల?"

"ఎవరో!—ఎవరయితేనేం?"

"ఇదిగో చూడు....ఒక్కక్షణం ఇక్కడ మిగిలున్నామా అంటే, ఇంక ఇంటిమొహం చూస్తామో లేదో! ఎవరికో కలరావచ్చింది—"

"అంత భయంగావుంటే మీరు వెళ్ళండి-"

"అంతా వెళ్ళిపోయారే—సత్రవ్‌ని ఖాళీచేసి"

"ఇదిగో—మీకే చెప్తుంట పొద్దున్న బండికి పోదాం,—ఇప్పుడు మాత్రం నేరాను గాకరాను" ఆఖరిమాట చెప్పింది.

అతను విసుగుతోనూ, కోపంతోనూ నిస్సహాయతతో వెళ్ళిపోయాడు. సామాన్లు గదియావలకి తీసుకువచ్చి పేర్చుకుని వుంచేడు, ఇందాక వాటిమధ్య చదికిలపడ్డాడు.....

ఆమె ఆలోచించసాగింది,

తను వెళ్ళిపోకతప్పదు. వెడితే, మరి పిల్లగతి? ఈపిల్ల ఎవరి పిల్లో తెలియదాయె! ప్రయత్నించడానికి సత్రవువదిలి అంతా వెళ్ళిపోయారుట, మరి పిల్లని మరచిపోయి వెళ్లిందా పిల్లతల్లి?

అలాగ మరచిపోతేనే తనకి మంచిది. కాని, రేపు తెల్లారిం తర్వాత, పిల్ల లేచి, తనని ఆనవాలుకట్టి, తల్లికోసం ఏడిస్తే తనేం చెయ్యాలి?

పోనీ, ఏడిస్తే ఏడ్చిందికాని కొన్నాళ్ళకి అలవాటై వూరుకుంటుంది. ఇప్పుడు పిల్లని తీసుకుని తను వెళ్లిపోతే—?

ఛా—అంది మనస్సు. ఎంత మరచిపోయిన తల్లి అయినా పిల్లకోసం కాస్త సేపట్లో కాకపోతే మరి కాస్తా సేపట్లోనన్నా వెతుక్కుంటూరాదా? ఇంకా వకమూల పాలుతాగేపిల్లని ఎలా మరచిపోయిందమ్మా? లేక ఇంకా కడసారిపిల్లవుందా?

తను పిల్లని తీసుకువెడితే ఆతల్లి పాపం ఎంతఏడుస్తుందో! తను బాధపడివున్నదే. వేరొకతల్లిని తను చేతులారా బాధపెట్టడమా?

రేపటివరకూవుండి ఆతల్లిని వెతికి పిల్లనిచ్చెయ్యడానికి ఆమె తీర్మానించుకుంది.

పిల్ల హాయిగా—ఏవేవో కష్టాలు మరచి పోయినట్లు, నిద్రపోతోంది. శాంతమ్మ నుంచి మాత్రం దూరంగా వెళ్ళిపోయింది నిద్ర:

అనేక ఆలోచనలు—మధ్యమధ్య శరీరం గగుర్పాటు....వీటితో ఆమె శరీరం తిమ్మి రెక్కిపోయింది....ఆ విధంగానే తెల్ల వార్చింది.

* * *

ఎవరో ఆపె—ఒకామెకు కలరా తగిలింది. కూడా వచ్చినవారంతా ఆమెను వదలివెళ్ళి పోయారు. ఒక విధవావిడమాత్రం మిగిలి వుంది. ఆమెకూడా దూరంగా నన్నుముట్టు గోకు నామాలకాకి—అన్నట్లు కాసుకు కూర్చుంది; హరీ అని అయిపోడంతోటే నెత్తిమీద చెంగువేసుకుని వెళ్ళిపోడానికి;

కలరా తగిలినమనిషిని, సత్రపు అధి కారులు, వీధి అరుగుప్రక్కకి సాయం పట్టేరు. ఒక తడికి అడ్డంగా కట్టించేరు. ఇంక కాస్తసేపటికో కూస్తసేపటికో మ్యునిసి పాలిటి లారీమీద ఆమెను తీసుకుపోతారు; ఈలోగానే యమకింకరులామెను లాక్కు పోతారు!

సత్రవుఅంతా ఖాళీ అయిపోయింది. ఒక వంకనుంచి సత్రవంతా ఫినైలు తో కడుగుతున్నారు, మూలమూలల ముగ్గుగు మరిస్తున్నారు. నారాయణనికూడా ఖాళీ చేసెయ్యమన్నారు,

శాంతమ్మ అతికష్టంమీద, ఈ చంటి గుడ్డు, ఆ కలరా తగిలిన మనిషిదయివుంటుం దని తెలుసుకుంది. ఆ మనిషి అసహాయ స్థితి చూసేసరికి ఆమె శరీరం నీరయింది. పిల్లని నారాయణకు వప్పగించింది.

"ఏంచేస్తావ్ దీనితో?" అని అడిగేడు. ఆమె "ఏమో!" అంది, ఎవరిపిల్లంటే, ఫలానాఆమె కూతురనిమాత్రం చెప్పింది.

* * *

ఆ అమ్మి ఎంతో బాధపడుతోంది. శాంతమ్మ మెల్లగా ఆమెని సమీపించింది. ఈమెనిచూసి, గోతిమీద నక్కలాగ కాచుకు కూర్చున్న విధవావిడ, చల్లగా తప్పుకుంది.

'ఇంతమొరటుగా వుంటుందా లోకం అనుకుంది. 'ఏం? నీలోనున్న మొరటుతనం మరచిపోయావా?' అంది మనస్సు.

ఆమె సిగ్గుపడింది. అంతవరకూ ఇంకా దూరంగానేవున్న తను ఒక్క అడుగులో రోగిని సమీపించింది. ..సాయంత్రంవరకూ సేవచేస్తూనేవుంది.

ఆతల్లి—తనబిడ్డ ఏమయిందో తనకి ఎవరు సేవలుచేస్తున్నారో, తెలుసుకునే స్థితిలోలేదు. అలాగనే కళ్లుమూసుకుంది. తను నిస్సహాయస్థితిలో వుండికూడ, ఆఖరి ఘడియలు, తమస్సులోనేవున్నా, చిన్న వెలుగుచినుకు చల్లదనంతో గడిపి వెళ్ళి పోయింది.......

నిన్నటిరాత్రి—అప్పటికి రెండురోజుల నుంచి ఆమనిషి నలతగావుంది—ఆమె జబ్బు చాలా ఎక్కువయింది. నలుగురూ చుట్టూచేరి ఆమందులూ ఈమందులూ నూరి పోశారు. చంటిపిల్ల దిక్కులేనిదైపోయింది. తనవిషయం పరికించేవారులేక—ఏడ్చి, ఏడ్చి,- తల్లి ఎక్కడుందో తెలుసుకోలేక, వెతు క్కుంటూ, తల్లిలాగ కనపడిన శాంతమ్మ ప్రక్కలో వచ్చి పడుకుని నిద్రపోయింది!

* * *

## 13

ఆపిల్ల చిన్నచిన్నమాటలు మాట్లాడుతోంది. "అమ్మడూ! నీపేరు?" అడిగింది శాంతమ్మ.

"అన్నపున్న" అంది పిల్ల, బిక్క మొహంతో, అంటూ శాంత గుండెల్లో తలదాచుకుంది...."

* * *

"నాకు మణివమ్మా"—

నువ్వు అన్నపూర్ణవే అయినా—నాకు నా పూర్ణవి!

'రా! తల్లీ! రా—నాయింటకి. ఆ చీకటికి నువ్వు మణిదీపానివి కావాలమ్మా!

'ఇన్నాళ్ళూ వెలితిగావున్న ఈగుండెలో నీ చల్లటిగుండెతో నింపవమ్మా!"

అనుకుంటూ అన్నపూర్ణని కౌగలించు కుంది.

* * *

ఇల్లు పాడుపడి మిగిలివుంది. ఊర్లో దిగే సరికి రాత్రి అయ్యింది.

చంటిపిల్లతో ఇంట్లో కొత్త వెలుగు అడుగుపెట్టింది. పిల్ల గజ్జెల ఘల్ ఘల్లులతో ఇల్లంతా నూతనచైతన్యంతో అల్లలాడ సాగింది.

పడకగదిగూట్లో ఇప్పుడు బొమ్మలేదు. అది రబ్బరుబొమ్మ. దానినగలన్నీ పూర్ణని అలంకరించేయి. ఇల్లంతా వెలుగుజల్లు అయి తిరుగుతోంది-నిండుప్రాణంతో ఇల్లు తొణికిస లాడుతోంది,

నారాయణ ఇనప్పెట్టెతెరుస్తాడు. డబ్బు లెక్కపెట్టడు. తగ్గిందో ఎక్కువయిందో చూడడు.

అస్తమానూ ఏదో బేరం పెడుతూనే వుంటాడు, కొసరడంచూసి—

"చివరకి పినాసితనం పోలేదింటుంది శాంత!

వీధిపేరంటాళ్ళంతా ఈ ఇంటికి పయనమై వస్తున్నారు. వారిని ఎదుర్కునేటందుకు— ఆహ్వానించేటందుకు — ఇల్లంతటావున్న వెయ్యిదీపాలకీ మించిన దీపం—"పూర్ణ" కిలకిలమంటూవుంది—ఏదీ చీకటి??

* * *

ఆనాడు

దినమెల్లా వుపవాసాలుండేవారూ, పూజలు చేసుకునేవారూ, రాత్రి జాగారాలు చేయడానికి సిద్ధపడేవారూ....ఇంకా పుత్సవానికనీ— ఆ....—రేయిని నిదురలుమాని బయలుదేరే వారూను....

—ప్రపంచమంతా ఒక్కసారి వెలుగు లోని కీడ్వబడిందా? కలకలలాడుతూ, కిలకిల నవ్వుతూ——ఏదో పాటలో పడిపోతు న్నట్లు, ఎక్కడికో ఏమో అయిపోతు న్నట్లు......

చీకటిపడిందని కాబోలునే! దీపారాధనలు చేసి, గృహలక్ష్ములు ఫక్కిపిల్లలతో సర్వభాను డికి మంగళహారతులు పాడుతున్నారు; చేయెత్తి తిరిగిరమ్మని దీవించి పంపు తున్నారు—

—అన్నమాటేగాని, భానుడులేని కొరత యెక్కడ? ప్రతిగృహమూ మళ్ళీ దీపాల తోరణాలతో అలంకరింపబడింది. పైన చల్లనివెన్నెల; లోన దీపాలవెల్లువ—ఇంకె క్కడిదీ చీకటి?!

లోకమంతా ఆనందమరీచికలలో తేలి పోతోందా? మానవకోటి అంతా తమ ఎప్పటి కష్టాలూ, ఎప్పటిపక్షాలూ, ఎప్పటిభేదాలూ.... అన్నీ—తమ స్వభావాలనే, తమ వ్యక్తిత్వా లనే — మరచిపోయారా?....ఇది కార్తీక పూర్ణిమా??

—ఆఖరు—